# లడ్డూలో కల్తీ నెయ్యి వాడలేదు

## దిప్రింట్ ఇంటర్వ్యూలో ఈవో శ్యామలరావు వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తేతెలంగాణ): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని టీడీపీ చేస్తున్న ప్రచారమంతా బోగస్ అని టీటీడీ ఈవో శ్యామలరావు మాటల్లో తేలిపోయింది. ప్రఖ్యాత ఆంగ్ల వెబ్‌సైట్ ది ప్రింట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈవో కీలక విషయాలను వెల్లడించారు. తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీ నుంచి వచ్చిన 4 ట్యాంకర్లలో నాణ్యత తగ్గినట్లు గుర్తించి ఆ నెయ్యిని ఉపయోగించలేదని.. జంతు, వెజిటెబుల్ కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ నుంచి నివేదిక రావడంతో ట్యాంకర్లను వెనక్కి పంపించేశామని తెలిపారు. కాగా, తిరుమల లడ్డూ వివాదంపై ప్రధాని మోదీకి వైసీపీ అధినేత జగన్ లేఖ రాశారు. టీటీడీ పవిత్రతను దెబ్బతీసేందుకు ఏపీ సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని లేఖలో ఆరోపించారు. బాబును గట్టిగా మందలించాలని, అసలు నిజాలు బయటపెట్టాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

### పవన్ ప్రాయశ్చిత్త దీక్ష

గుంటూరు జిల్లా నంబూరులోని దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 11రోజుల ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. మహాప్రసాదంగా భావించే శ్రీవారి లడ్డూను కూడా కల్తీ చేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

### లడ్డూ కల్తీపై సుప్రీంలో పిల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని వస్తున్న ఆరోపణలపై సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. తిరుమల లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని వస్తున్న ఆరోపణలపై సిట్‌తో విచారణకు ఆదేశించాలని కోరుతూ రైతు, హిందూ సేన అధ్యక్షుడు అయిన సుర్జిత్ సింగ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎంతో పవిత్రంగా భావించే శ్రీవారి ప్రసాదంలో కల్తీ జరిగిందన్న జరుగుతున్న ప్రచారం హిందువులను తీవ్రంగా కదిలించిందని, వారి విశ్వాసం, మనోభావాలు తీవ్రంగా దెబ్బతీసిందని అన్నారు.

# ఏకపక్షంగా నీటిని కిందికి వదిలారు

## ప్రధానికి మమత లేఖ

కోల్‌కతా, సెప్టెంబర్ 22: దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ) డ్యాముల నుండి నీటి విడుదల విషయంలో కేంద్రం తీరుపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర జల కమిషన్ ప్రతినిధులు, జల్‌శక్తి శాఖ, కేంద్రం కీలక నిర్ణయాలన్నీ ఏకపక్షంగా తీసుకున్నాయని ప్రధాని మోదీకి రాసిన రెండో లేఖలో సీఎం మమత ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయాలతో సంబంధం లేకుండా అనేకమార్లు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారని ప్రధానికి తెలిపారు. దీనివల్ల ఇటీవల బెంగాల్‌లో 5 లక్షల మంది వరద ముంపునకు గురయ్యారని, ముంపు బాధితులను ఆదుకునేందుకు కేంద్రం నిధులు కేటాయించి, వాటిని విడుదల చేయాలని కోరారు.

# నేడు బ్లాక్‌డేగా పాటించాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తేతెలంగాణ): దేశవ్యాప్తంగా సోమవారం బ్లాక్‌డేగా పాటించాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్‌కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. సోమవారం అన్ని డిపోలు, ఆఫీసుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని కోరారు.




















